
విలేకర్లు కావలెను
తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో
అది తక్కువ సమయంలో ప్రజాధరణ పొందుతున్న
మన ప్రజాశక్తి తెలుగు దినపత్రికలో
అనుభవం, ఆసక్తిగల విలేకర్లు కావలెను
ఎటువంటి టార్గెట్లు లేవు
జిల్లా స్టాఫ్ రిపోర్టర్
నియోజకవర్గ ఆర్.సి
మండల రిపోర్టర్
సంప్రదించండి : 9030320743

తెలుగు దినపత్రిక
# మన ప్రజాశక్తి
ప్రజాగళమే.. మా కలం
www. ManaPrajasakti.com
తెలంగాణ\ ఆంధ్రప్రదేశ్




నల్గొండ | సోమవారం | 13-4-2026 | ఎడిటర్: మెరుగు. భరత్ కుమార్ | సంపుటి: 1 | సంచిక:185 | పేజీలు: 8 | వెల: రూ.4/-




ఏప్రిల్ 22 వరకు
## భగభగే

- గరిష్ఠంగా 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- ఇప్పటికే 27 జిల్లాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం వేళ ప్రజలు బయటకు రావద్దని వాతావరణ శాఖ హెచ్చరిక

**హైదరాబాద్,ఏప్రిల్12,**

తెలంగాణలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతోందని, రానున్న పది రోజుల పాటు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఏప్రిల్ 22వ తేదీ వరకు పలు జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు చేరవచ్చని అంచనా వేసింది.గత వారం రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా నమోదవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు
# చీకటి దోస్తీ

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన సీఎం అంటూ కేటీఆర్ ఫైర్
- తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చీకటి దోస్తీ చేస్తున్నాయంటూ వ్యాఖ్యలు
- సింగరేణిలో అవినీతి ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపై అగ్గిపుట్టిస్తామని హెచ్చరిక
- సింగరేణి కుంభకోణంపై కేంద్రం విచారణ జరపడం లేదని ఆగ్రహం

**హైదరాబాద్,ఏప్రిల్12,**




రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 'దోచుకో–దాచుకో' అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ అవినీతి, దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్ల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అంతటి భారీ అవినీతిపరుడైన ముఖ్యమంత్రి దేశంలోనే మరొకరు లేరని ఘాటుగా విమర్శించారు.కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా మారి ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు. "సింగరేణిలో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నా, 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఉలుకూపలుకూ లేకుండా మౌనంగా ఉంది. దీనిపై సీబీఐ విచారణ జరపాలని కోరినా పట్టించుకోవడం లేదు. ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని విమర్శించారు.

ఆమె పాటలు ఎప్పటికీ
# ప్రతిధ్వనిస్తాయి

## ఆశా భోంస్లే మృతిపై ప్రధాని మోదీ స్పందన

**న్యూఢిల్లీ,ఏప్రిల్12,**

ప్రముఖ గాయని ఆశా భోంస్లే మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మరణం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. భారతదేశం చూసిన అత్యంత ప్రసిద్ధ, బహుముఖ ప్రజ్ఞావంతురాలైన గాయకులలో ఆశా భోంస్లే ఒకరని మోదీ కొనియాడారు.



# చైనాకు ట్రంప్ 'సీరియస్' వార్నింగ్

## ఇరాన్‌కు ఆయుధాలిస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరిక

**ఇంటర్నెట్ డెస్క్,ఏప్రిల్12**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌కు రహస్యంగా ఆయుధాలు సరఫరా చేయడాన్ని వెంటనే ఆపకపోతే, భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది."మా శత్రువులకు మీరు ఆయుధాలు ఇస్తే, మేం మిమ్మల్ని వదిలిపెట్టబోం" అని ట్రంప్ ఘాటుగా హెచ్చరించారు.



హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాను అడ్డుకోవాలన్న ఇరాన్ ప్రయత్నాలకు సహకరించే దేశాలపైనా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



2029లోపే
# మహిళా రిజర్వేషన్లు

- మహిళా రిజర్వేషన్ల అమలుపై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి
- 2029 ఎన్నికలలోపే అమలు చేసేందుకు సన్నాహాలు
- మద్దతు కోరుతూ పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధాని లేఖ

**న్యూఢిల్లీ,ఏప్రిల్12,**

చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే "నారీశక్తి వందన్ అధినియం" (మహిళా రిజర్వేషన్ బిల్లు) అమలు దిశగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. 2029 సార్వత్రిక ఎన్నికలలోపే మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు వీలుగా, ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని కోరుతూ లోక్‌సభ, రాజ్యసభలోని అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ఆయన లేఖ రాశారు.

# తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల..

- తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు 2026 విడుదల
- ఫస్టియర్‌లో 66.20%, సెకండియర్‌లో 70.58% మంది ఉత్తీర్ణత
- ఫలితాల్లో మరోసారి సత్తా చాటిన అమ్మాయిలు

**హైదరాబాద్,ఏప్రిల్12,**

లక్షలాది మంది విద్యార్థుల ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ వార్షిక పరీక్షల ఫలితాలు–2026 విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంబంధాల సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఫలితాల్లో ఇంటర్ ఫస్టియర్‌లో 66.20 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్‌లో 70.58 శాతం మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా ఫలితాల్లో అమ్మాయిలే పైచేయి సాధించి తమ సత్తా చాటారు.






ప్రపంచ ఉగ్రవాద సూచీలో ప్రథమస్థానం
# పాకిస్థాన్‌దే

- గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2026లో పాకిస్థాన్‌కు అగ్రస్థానం
- గత ఏడాది ఉగ్రవాద దాడుల్లో 1,139 మంది మృతి

**ఇంటర్నెట్ డెస్క్,ఏప్రిల్12**


ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద మరణాలు, దాడుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతున్నప్పటికీ, పాకిస్థాన్‌లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2026లో పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది.

# శ్రీవారి ఖజానాకు కాసుల వర్షం

## రికార్డు స్థాయిలో పెరిగిన భక్తుల దర్శనాలు

**తిరుమల ,ఏప్రిల్12,**

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రం 2025–26 ఆర్థిక సంవత్సరంలో అపూర్వమైన రికార్డులను నమోదు చేసింది. భక్తుల దర్శనాల నుంచి హుండీ ఆదాయం వరకు అన్ని విభాగాల్లోనూ గత రికార్డులను అధిగమించి సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. టీటీడీ పక్కా ప్రణాళిక, ఆధునిక టెక్నాలజీ వినియోగంతో ఇది సాధ్యమైంది.





నా ప్రమేయం నిరూపిస్తే
# దేనికైనా సిద్ధం

- లాయర్ సుబ్బారావుపై పంజాగుట్ట పోలీసులకు సింగర్ మంగ్లీ ఫిర్యాదు
- బిగ్ బాస్ షో ఎంట్రీ కోసమే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపణ

**హైదరాబాద్,ఏప్రిల్12**

ప్రముఖ జానపద గాయని మంగ్లీ, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారంటూ న్యాయవాది సింగపోగు సుబ్బారావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేవలం బిగ్ బాస్ షోలో అవకాశం కోసమే సుబ్బారావు తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రచారం పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆమె తీవ్రంగా మండిపడ్డారు.




అమెరికాతో చర్చలు
# విఫలం

**ఇంటర్నెట్ డెస్క్,ఏప్రిల్12**

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణాన్ని ముగించే లక్ష్యంతో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా, ఇరాన్‌ల మధ్య జరిగిన అత్యున్నత స్థాయి చర్చలు విఫలమయ్యాయి. ఒప్పందం కుదరకపోవడంతో ఇరు దేశాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నాయి.

# గుడ్ న్యూస్ చెప్పిన టీసీఎస్

## కొత్తగా 25 వేల మంది ఫ్రెషర్లకు అవకాశం





**ఇంటర్నెట్ డెస్క్,ఏప్రిల్12**

దేశంలోని అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ప్రస్తుత 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను తమ నియామక ప్రణాళికలను వెల్లడించింది. ఈ ఏడాదిలో సుమారు 25 వేల మంది ఫ్రెషర్లను ఉద్యోగాల్లోకి తీసుకోనున్నట్లు ప్రకటించింది.

అమర్‌నాథ్ యాత్ర 2026
# షెడ్యూల్ విడుదల

**ఇంటర్నెట్ డెస్క్,ఏప్రిల్12**



పవిత్ర అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్‌ను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. ఈ ఏడాది యాత్ర జులై 3న ప్రారంభమై, 57 రోజుల పాటు కొనసాగి ఆగస్టు 28న రక్షాబంధన్ పర్వదినం రోజున ముగుస్తుందని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వెల్లడించారు.

## కాలనీ వాసులు ఆర్చీల ఏర్పాటు అభినందనీయం కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్,టూ టౌన్ ఎస్ఐ సైదులు



**నల్లగొండ టౌన్,మనప్రజాశక్తి,ఏప్రిల్ 12:**

నల్లగొండ పట్టణం 20వ వార్డులోని శ్రీ లక్ష్మీ బాలాజీ కాలనీ (గాదీజ) వాసులు ఏర్పాటు చేసుకున్న ఆర్చీలను స్థానిక కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్,పాలడుగు నాగార్జున మరియు టూ టౌన్ ఎస్ఐ సైదులు ప్రారంభించారు.

## వివో ఏ ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి



వి.వో.యే నల్గొండ జేపసీ జిల్లా అధ్యక్షులు కేతావత్ శరత్ కుమార్.

**అడవిదేవులపల్లి,/ఏప్రిల్ 12 (మన ప్రజాశక్తి )**

ఆదివారం నాడు అడవిదేవులపల్లి మండల వి. వో. ఏ జేఏసీ సమావేశం మండల కేంద్రంలో నిర్వహించడం .జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా జేఏసీ అధ్యక్షులు కేతావత్ శరత్ కుమార్ గారు పాల్గొనడం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వివోఏ డిమాండ్లను, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన అన్నారు . ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 20 వేల రూపాయలను వేతనాన్ని ప్రకటించాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, అర్హులైన వీవోఏ ల ను సిసిలుగా పదోన్నతి కల్పించాలని ,ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఏపిఎం సీసీలు, విఓఏ లను వేధింపులకు గురి చేస్తున్నారని అలాంటి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేనియెడల జిల్లా గ్రామీణ అభివృద్ధి కార్యాలయము ఎదుటజేఏసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొర్ర నాగ నాయక్, బొజ్జ వినోద, కేశబోయిన జ్యోతి,వెంకటేష్, ముని, లక్ష్మణ్, చెన్నయ్య, భవాని, లలిత, రవి తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఉప్పల్ ఏప్రిల్ 12 మన ప్రజాశక్తి**

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ బీరప్ప గడ్డ తేనె లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నుండి బ్యాంకు కాలనీ పార్క్ వరకు 25 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనంతరం వారు జిహెచ్ఎంసి అధికారులతో కాంట్రాక్టర్ తో మాట్లాడుతూ ఈనెల 30 తారీఖున లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం ఉన్న నేపథ్యంలో పనులను త్వరత గతిన పూర్తి చేయాలని కళ్యాణ మహోత్సవం వరకు అన్ని పనులు పూర్తి చేయాలని వారిని కోరడం జరిగింది. కాలనీల నుండి ఉప్పల్ చౌరస్తా కు వెళ్లే ప్రధాన రహదారి కావడం వల్ల కూడా దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరత గతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని వారికి తెలపడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు కొండల్ రెడ్డి కోకొండ జగన్,బింగి శ్రీనివాస్ గోవు ఆనంద్ , ఇంద్రసేనారెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, బాలు , శ్యామ్,బంటి గౌడ్ ,చిన్న, మైసలు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యం కుందేటి వారసత్వం

**నేరేడుచర్ల రూరల్ ఏప్రిల్ 12 (మన ప్రజాశక్తి)**



సూర్యాపేట జిల్లానేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన కుందేటి రాజశేఖర్ సునీత దంపతుల ప్రథమ కుమారుడు కుందేటి అఖిల్ ఎంపిసీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షల్లో 962 మార్కులతో మెరుగైన ఉత్తీర్ణత ప్రభంజనం సృష్టించాడు.తల్లి గృహిణి,తండ్రి పెయింటింగ్ పనిలో నిమిత్తమై సంపాదించిన దాంట్లో తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించలన తపన తాను పడుతున్న కష్టానికి ఆదివారం ఇంటర్మీడియట్ ఫలితాలలో కుమారుడి ప్రతిభను చూసి తల్లితండ్రి కళ్ళల్లో కన్నీటి ఆవేదన ఆనంద భాష్పాలతో కుమార్ని ముద్దాడుతూ మిట్టయిలు పంచారు ఈ కార్యక్రమంలో నాగమణి ధర్మ పెదింటి విద్యా కుసుమని అభినందనలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# ఆలేరు మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య.





**మన ప్రజాశక్తి ఆలేరు మండలం ఏప్రిల్ 12.2026**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం, గోలనుకొండ, కొల్లూరు, మందనపల్లి,గ్రామాల్లో అదేవిధంగా ఆలేరు పట్టణంలోని మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని తెలిపారు.రైతులు పండించిన వరి ధాన్యాన్ని సరైన ధరకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. కనీస మద్దతు ధర ఎం. ఎస్.పి ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు న్యాయం చేస్తుందని తెలిపారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించే విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో తాగునీరు, తూకం యంత్రాలు, గన్నీ సంచులు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా, తేమ శాతం సరైన స్థాయిలో ఉంచి తీసుకురావాలని సూచించారు.ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య రెడ్డి, ఆలేరు ఎమ్మార్వో ఆంజనేయులు, ఆలేరు మున్సిపాలిటీ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, ఆలేరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఆలేరు మార్కెట్ కమిటీ సెక్రటరీ పద్మజ, ఏ. ఈ.ఓ శివకుమార్, సాకేరా, గ్రామ వికాస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వస్పరి స్వామి, డైరెక్టర్స్ మరియు రైతులు పాల్గొన్నారు

# ప్రశ్నించకపోతే బానిసలు అవుతాం

### మధ్యాహ్న భోజన కార్మికులు గలం వినిపించాలి సలీం

**నల్లగొండ టౌన్,మన ప్రజాశక్తి, ఏప్రిల్ 12:**




ప్రశ్నించకపోతే బానిసలు అవుతామని మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకోవడం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై తమ గళాన్ని వినిపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం డి సలీం కార్మికులకు పిలుపునిచ్చారు.

ఆదివారం నల్లగొండ సిఐటియు జిల్లా ఆఫీసు కార్యాలయంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సలీం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులను యాజమాన్యాలకు బానిసలు చేయడానికి నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చిందని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా కార్మికులకు పదివేల రూపాయల వేతనం అమలు చేసి కార్మికుల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే మెనూ చార్జీలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచాలని అన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలు ఉపాధ్యాయులు కార్మికులను అనేక రకాలుగా వేధింపులకు, భయాందోళనలకు గురిచేస్తూ నారన్నారు. కార్మికులపై కక్ష సాధింపులు ఆపాలని ఉపాధ్యాయులను కోరారు. అతి తక్కువ వేతనముతో కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని అన్నారు నెలలు తరబడి బిల్లులు వేతనాలు రాకపోయినా అప్పులు తెచ్చి పిల్లల కడుపులు నింపుతున్నారని అలాంటి వారిపై కక్ష సాధింపు చర్యలు ఉండవద్దని అన్నారు.

యూనియన్ జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామూహిక వంటశాల పేరుతో స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే ఆలోచన చేస్తుందని కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రజా పాలనలో కార్మికులు కర్షకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఏదైనా ప్రమాదానికి గురైతే పిల్లి చస్తే గొడవ తల వేసిన చందంగా కార్మికుల పట్ల ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం ప్రొసిడింగ్ ఆర్డర్స్ గుర్తింపు కార్డులను కాటన్ దుస్తులను డ్రెస్ కోడ్ గా నిర్ణయించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు వేతనాలను వెంటనే విడుదల చేసి కార్మికులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేసి పదివేల వేతనం అందివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో అరుణ జ్యోతి, కొప్పు ఆండాలు, నూర్జహాన్, పార్వతమ్మ, విజయ, ఎల్లయ్య, వినోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలే సత్యనారాయణ
యూనియన్ జిల్లా కార్యదర్శి.

# లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**నేరేడుచర్ల:- ఏప్రిల్ 12 మన ప్రజాశక్తి**




లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల వారి ఆధ్వర్యంలో పాత నేరేడుచర్ల లో ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు లయన్ గుండ్రెడ్డి సైదిరెడ్డి ప్రారంభించారు.ఈ శిబిరాన్ని సూర్యాపేట జమ్మిగడ్డ లయన్స్ క్లబ్ కంటి హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ చామంతి నిర్వహించారు.130 మందికి కంటి స్క్రీనింగ్ చేసి 34 గురిని కంటి ఆపరేషన్ కు గుర్తించారు.గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు మరియు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నట్లు క్లబ్ సీనియర్ సభ్యులు దొండపాటి అప్పిరెడ్డిమరియు డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ బట్టు మధు తెలిపారు.త్వరలోనే మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు .ఈ సందర్భంగా లయన్ దొండపాటి అప్పిరెడ్డి గారు సొంత ఖర్చు తో కంటి అద్దాలు అందచేసారు. బట్టు మధు 150 మంది పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చామంతి హాస్పిటల్ మానేజ్మెంట్ బృందం.క్లబ్ సెక్రటరీ షేక్ యూసుఫ్ క్లబ్ కోశాధికారి సరికొప్పుల నాగేశ్వరరావు సభ్యులు బాల వెంకటేశ్వర్,ములగుడ్ల వెంకటరెడ్డి,బి.బాలు లు వార్డ్ కౌన్సిలర్ గుగులోతు రవీందర్ ,గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



### అలరించిన కర్ణాటక గాత్ర కచేరి భరతనాట్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఉప్పల్ ఏప్రిల్ 12 మన ప్రజాశక్తి**

ఉప్పల్ మినీ శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాత్విక స్కూల్ అఫ్ కర్నాటిక్ వోకల్ అండ్ భరతనాట్యం డాన్స్ స్కూల్ గురువు కమల నేమాని డాక్టర్ సత్య నేమాని శిష్యబృందం కర్ణాటక గాత్ర కచేరి భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించాయి. కర్ణాటక గాత్ర కచేరి లో గీతం, స్వరజతి, వర్ణం, పలుకే బంగారమాయెనా, శారదా అష్టకం పాటలను శ్రేయ, గాయత్రీ,అర్చితా వేదం సంహిత జీవిక, ధీరజ్, ఆరాధ్య, లాస్య మొదలైన వారు ఆలపించారు. భరతనాట్య ప్రదర్శనలో పుష్పాంజలి, గణపతి గణపతి, తీస్ర అలరిపు, శ్యామల మీనాక్షి, గణపతి కౌతం , వందేమాతరం, ముద్దుగారే యశోద, అలరులు కురియగా మొదలైన అంశాలను రాగిణి, వినిష, సద్విక, నందిని, బ్రహ్మీని, వేదసంహిత, సౌమ్య, నిత్య, వైష్ణవి, వందిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



# ఎర్రకుంట స్మశాన వాటిక నూతన కమిటీకి సన్మానం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఉప్పల్ ఏప్రిల్ 12 మన ప్రజాశక్తి**



ఎర్రకుంట హిందూ స్మశాన వాటిక నూతన కమిటీకి అధ్యక్షుడిగా శ్రీమూర్తి నాగరాజు ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల కార్తీక్, కోశాధికారిగా కొమ్మగాళ్ల కౌశిక్ను ఎన్నికయ్యారు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు టిఆర్ఎస్ నాయకులు బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సాయిజన్ శేఖర్ శాలువాలతో సత్కరించడం జరిగింది ఎర్రగుంట హిందూ స్మశాన వాటికను వైకుంఠధామం చేయడానికి మూడు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు తెలియజేశారు. ఇప్పటికే కోటి రూపాయలతో కాంపౌండ్ వాల్ లోపల సిమెంట్ రోడ్లు వేయించడం జరిగిందని అలాగే వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందని కొత్తగా మరో 50 లక్షల రూపాయలతో స్నానాల గదులు కొత్త బర్నింగ్ ప్లాట్ఫారం నిర్మిస్తున్నట్లు తెలియజేయడమైనది ఈ కార్యక్రమంలో బందెల మనోజ్, సందీప్, బొడ్డు శివ, విష్ణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# సమానత్వం సామాజిక న్యాయం
# ఉప్పల్ డిగ్రీ కళాశాలలో సమీక్ష రాష్ట్ర స్థాయి పోటీలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఉప్పల్ ఏప్రిల్ 12 మన ప్రజాశక్తి**

ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతరత్న డా.బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రేపు సమానత్వం, సామాజిక న్యాయ సదస్సు జరుగుతుంది. డా.బిఆర్ అంబేద్కర్ రాసిన కులనిర్మూలన (ూఅఅఱష్ట్రఱశ్రీ్ఱశీఅ శీట ఝష్రవ ) అనే పుస్తకం సమీక్ష రాష్ట్రస్థాయి పోటీలు జరుగనున్నాయి. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి శ్రీ పి.విజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి జల్దా విశ్వనాథ్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేయనున్నారు.

ముఖ్యాతిథిగాప్రముఖ సామాజిక ఉద్యమకారిణి, కవయిత్రి, రచయిత్రి జూపాక సుభద్ర విచ్చేసి రాష్ట్రస్థాయి పుస్తక సమీక్ష పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహించనున్నారు. అనంతరం ఆమె "మౌనం నుండి ప్రతిఘటన వైపు: మహిళలు మరియు కుల నిర్మూలన"



అనే అంశం పై, గౌరవ అతిథి, మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డా.బండి రాజు గారు "ప్రజాస్వామ్యం మరియు సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ ప్రణాళిక"అనే అంశం పై ప్రసంగించనున్నారని సభాధ్యక్షులు ప్రిన్సిపాల్



డా.కె.విజయ్ కుమార్ తెలియ జేశారు. విజేతలైన విద్యార్థులకు ఆకర్షణీయమైన బహుమతులు గలవని సమన్వయ కర్తలు విజయ్ కుమార్, విశ్వనాథ్ కుమార్ తెలియజేశారు.

# లాయర్ హరిప్రసాద్ హత్య కేసును
# ఛేదించిన పల్నాడు పోలీసులు... నిందితుల అరెస్ట్

పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించిన యువ న్యాయవాది శ్రీరామ హరిప్రసాద్ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు పాల్పడింది మరెవరో కాదు, మృతుడి తోడల్లుడు, నరసరావుపేటలో పోలీసు కానిస్టేబుల్గా పనిచేస్తున్న వెంకట కోటయ్య అని తేల్చారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు నిర్ధారించి, అతడిని, మరో నిందితుడిని అరెస్టు చేశారు. రక్షించాల్సిన పోలీసు సిబ్బందే ఈ హత్యలో ప్రధాన నిందితుడిగా తేలడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.వివరాల్లోకి వెళితే, ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన శ్రీరామ హరిప్రసాద్ (37) ఒంగోలులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గత శుక్రవారం (ఏప్రిల్ 10) తెల్లవారుజామున చిలకలూరిపేట మండలం యడవల్లి సమీపంలో ఆయన మృతదేహం లభ్యమైంది. ఆయన స్కూటీ మృతదేహంపై పడి ఉండటంతో, తొలుత ఇది రోడ్డు ప్రమాదంగా అందరూ భావించారు. అయితే, ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు అనుమానాలు తలెత్తాయి. మృతుడి తల వెనుక భాగంలో బలమైన గాయం ఉండటంతో ఇది ప్రమాదం కాదని, హత్యేనని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. లోతుగా దర్యాప్తు చేపట్టగా, హత్యకు ముందు నిందితులు మద్యం కొనుగోలు చేసినప్పుడు జరిపిన ఒక ఫోన్పే లావాదేవీ కీలక ఆధారంగా మారింది. ఈ ట్రాన్సాక్షన్ ఆధారంగా



పోలీసులు నిందితుడిని గుర్తించారు.మృతుడు హరిప్రసాద్ భార్య, నిందితుడు కానిస్టేబుల్ వెంకట కోటయ్య భార్య అక్కాచెల్లెళ్ల కూతుళ్లు. హరిప్రసాద్ తరచూ మద్యం తాగి తనను వేధిస్తున్నాడని నాగజ్యోతి తన సోదరి భర్త వెంకట కోటయ్యతో చెప్పుకుని బాధపడేది. తన మరదలి కష్టాలు చూడలేక, హరిప్రసాద్ను అడ్డు తొలగించాలని కానిస్టేబుల్ కోటయ్య నిర్ణయించుకున్నాడు.ఇందుకోసం తన స్నేహితుడైన శ్రీనివాసరావుతో కలిసి పక్కా ప్రణాళిక రచించాడు. గురువారం రాత్రి 'పార్టీ చేసుకుందాం రా' అని నమ్మించి హరిప్రసాద్ను నరసరావుపేటకు పిలిపించారు. కోటప్పకొండ రోడ్డులోని ఓ హోటల్లో ముగ్గురూ కలిసి అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. హరిప్రసాద్కు పూర్తిగా మత్తు ఎక్కాక, యడవల్లి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ బండరాయితో తలపై బలంగా మోది దారుణంగా హత్య చేశారు. అనంతరం దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంపై స్కూటీని పడేశారు. అయితే పోలీసుల దర్యాప్తుతో అసలు నిజం బయటపడింది. పోలీసులు కానిస్టేబుల్ వెంకట కోటయ్య, అతని స్నేహితుడు శ్రీనివాసరావును అరెస్టు చేసి, రిమాండ్కు తరలించారు.

# ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరం: పవన్ కల్యాణ్

ప్రముఖ గాయని, లెజెండరీ సింగర్ శ్రీమతి ఆశా భోంస్లే మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ సినిమాలో ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరమని, ఆమె లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు.పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "హిందీతో పాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ సహా అనేక భాషలలో కొన్ని దశాబ్దాల పాటు ఆశా భోంస్లే గారు లెక్కలేనన్ని చిరస్మరణీయ గీతాలను ఆలపించారు. శాస్త్రీయ, పాశ్చాత్య, సమకాలీన సంగీత శైలులలో ఆమె చూపిన అసాధారణమైన బహుముఖ ప్రజ్ఞ అన్ని తరాల సంగీత ప్రియుల మన్ననలను పొందింది" అని కొనియాడారు."దమ్ మారో దమ్", "చురాలియా హై తుమ్నే", "ఇన్ ఆంఖోం కీ మస్తీ", "రాధా కైసే నా జలే" వంటి ఆమె పాటలు ఎప్పటికీ నిలిచిపోతాయని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలుగు సినిమాలలో ఆమె పాడిన పాటలు తక్కువే అయినా, హిందీ సంగీతం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆమె ఎంతో ఆదరణ పొందారని



తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

# భావ వ్యక్తీకరణల వనం




కళ ద్వారానే ఒక జాతి యొక్క ఆత్మ సాక్షాత్కరిస్తుంది' అంటారు టాగూర్. ఏ దేశ సంస్కృతిలోనైనా కళకు ఒక ప్రత్యేక స్థానం వుంటుంది. ఇది సృజనాత్మకతను, సాంస్కృతిక వైవిధ్యాన్ని నిర్మిస్తుంది... ప్రోత్సహిస్తుంది. కళ అనేది మనిషి తన భావాలను, ఆలోచనలను, అనుభూతులను... రూపం, శబ్దం, రంగు, కదలికల ద్వారా అందంగా, సృజనాత్మకంగా వ్యక్తీకరించే ఒక ప్రక్రియ. అయితే, ప్రాచీన భారతీయ సాంప్రదాయంలో కళలను 64 రకాలుగా వర్గీకరించారు. వీటిలో చిత్రలేఖనం, శిల్పం, నాట్యం, నాటకం, సాహిత్యం, సంగీతం వంటివి ప్రధానంగా వున్నా, ఈ కళలకు మాత్రమే పరిమితం కాదు. మొత్తం మానవుని జీవన గమనానికి సంస్కృతి ప్రాతినిధ్యం వహిస్తుంది. భారతీయ సంస్కృతి వేల సంవత్సరాల చరిత్ర, అనుభవం, ఆచార వ్యవహారాల కలయిక. ఈ సంస్కృతిలో ఆట, పాట కేవలం వినోదం మాత్రమే కాదు, మన జీవన విధానంలో అంతర్భాగం. పల్లె గాలిలో మనోహరంగా వినిపించే జానపదాలు, పండుగల్లో ప్రతిబింబించే వివిధ రకాల నృత్య సంప్రదాయాలు, నాటకాలు, తోలుబొమ్మలాటలు భారతీయ ఆత్మకు ప్రతిబింబాలు. ఇవేగాక, కుటుంబ పరంగానూ, రక్త సంబంధీకులతో కలిగివుండే సంబంధ బాంధవ్యాల ద్వారా సంక్రమించే విలువలు, సాంప్రదాయాలు, ఆచారాల వంటివి కూడా సంస్కృతిలో భాగంగా వుంటాయి. అందుకే అంటారు గురజాడ–'దేశమంటే మట్టికాదోరు, దేశమంటే మనుషులోరు' అని. ఇవి ఒట్టి మాటలు కాదు... మన సంస్కృతికి మూలస్తంభాలు.ఆధునికత పేరుతో మన మూలాలను మర్చిపోతున్నాం. పాశ్చాత్య నాగరికత ప్రభావం, మతోన్మాదం మన సంస్కృతిని క్రమంగా కలుషితం చేస్తున్నాయి. డిజిటల్ యుగంలో ఫాస్ట్ బీట్ మ్యూజిక్, పాశ్చాత్య సంగీతం, సోషల్ మీడియా ట్రెండ్స్, ఫాస్ట్ ఫుడ్, పబ్ కల్చర్... మన మూలాలను మసకబారుస్తున్నాయి. ఒకప్పుడు గ్రామీణ్యంలో కోలాటాలు, తప్పెటగుళ్లు, గొల్లసుద్దులు, పద్య నాటకాలు వంటి ఆట పాటలతో కళలు జనరంజకంగా వుండేవి. ఇప్పుడు టీవీ, మొబైల్ గేమ్స్, రీల్స్, ఓటిటి ప్లాట్ఫారమ్లు ఆ స్థానాన్ని ఆక్రమించాయి.ఇక మతోన్మాదం కూడా కొత్త రూపం తీసుకుంది. ఇవే కళలను, మాధ్యమాలను తనకనుకూలంగా మార్చుకుంటూ..అసలైన భారతీయతకు వక్రభాష్యాలు చెబుతూ భ్రష్టపరుస్తోంది. 'మన సంస్కృతి––ఆట పాటలు, కళలలో దాగివుంది. దాన్ని కోల్పోతే, మనల్ని మనమే కోల్పోతాం' అంటారు స్వామి వివేకానంద. కళను, కళాకారులను గౌరవించడంతో పాటు మానవ జీవితాల్లో కళ ప్రాముఖ్యతను తెలియజేసే ఉద్దేశంతో ప్రతి యేటా ఏప్రిల్ 15న 'ప్రపంచ కళా దినోత్సవం' నిర్వహిస్తారు. 'కళ అనేది మాటల్లో చెప్పలేని భావాన్ని వ్యక్తీకరించే ఒక మాధ్యమం' అంటాడు లియోనార్డో డా విన్సీ. ఈయన పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తోన్న ఈ వేడుక–– 'భావవ్యక్తీకరణల వనం: కళ ద్వారా సమాజాన్ని పెంపొందించడం' అనే నినాదంతో ఈ ఏడాదిని ఫలవంతం చేయనుంది. ఒక తోటలో రకరకాల మొక్కలు, విభిన్న వర్ణాల పూలు కలిసి వుంటేనే అందం. సమాజం కూడా అచ్చం అటువంటిదే. భాషలు, ప్రాంతాలు, కుల మతాలకు అతీతంగా మనుషులను ఏకం చేయగలిగే శక్తి ఒక్క కళకే వుంది. ఒక చిత్రం వేల పదాల భావాన్ని వ్యక్తపరిస్తే, ఒక కళ సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తుంది, సమాజాన్ని చైతన్యపరుస్తుంది.కళాకారులు సమాజానికి దిక్సూచీలు. వారు పండించే భావాల తోటలో శాంతి, సహనం, సౌభ్రాతృత్వం వికసించాలి. 'ప్రతి బిడ్డలోనూ ఒక కళాకారుడు వుంటాడు. సమస్యల్లా పెద్దయ్యాక కూడా ఆ కళాకారుడ్ని మనలో ఎలా సజీవంగా వుంచుకోవాలనేదే' అంటాడు పాబ్లో పికాసో. ఏ దేశ సంస్కృతి అయినా నిలబడాలంటే, యువత దానిని గౌరవించాలి. 'మన సంస్కృతిని కాపాడుకోవడం అంటే...దాన్ని జీవవంతంగా వుంచడం, అంతేగాని మ్యూజియంలో పెట్టడం కాదు' అంటారు అంబేద్కర్. మన సంస్కృతిని యువత గౌరవించి, ఆచరించినప్పుడే ఆ సంస్కృతి సజీవంగా వుంటుంది. అలాగని, మూఢత్వాన్ని గుడ్డిగా అనుకరించడం కాదు. మన సంస్కృతిలోని మంచిని స్వీకరించి, కాలానుగుణంగా అభివృద్ధి చేయాలి. జానపద కళలను, స్థానిక కళాకారులను ప్రోత్సహించాలి. భారతదేశం భిన్న ఆలోచనల సంగమం. ఈ సంగమంలో ప్రతి తరానికి బాధ్యత వుంది. మన సంస్కృతిని పరిపుష్టం చేసి, భవిష్యత్ తరాలకు అందించడమే కళా దినోత్సవం అసలైన ఉద్దేశం.

# సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్
# సుకాన్ 2026 సతీష్ మ్యూజిక్ అకాడమీ




**మన ప్రజాశక్తి ఏప్రిల్12**




హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ లో నిర్వహించిన సుకాన్ 2026 వేడుకలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలానికి చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమీ డప్పుల బృందం కాలు గజ్జి కట్టి డప్పు సంకనేసి పలు రకాల వాయిద్యాలతోటి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని అలరించారు. ఇంత చక్కని అవకాశం కల్పించిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా,,ఏనుగు నర్సింహా రెడ్డి కీ అందె భాస్కర్ లకీ మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ డప్పు సతీష్ అమరవరపు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డప్పు కళాకారులూ , వీరబాబు, నాగమణి, రాణి , అపర్ణ, గంగ, రమణ,ధనమ్మ, లావణ్య, అనురాధ, సుజాత,భువన,సంధ్య, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

# 'లులూ' సందేశం



కార్పొరేట్ వ్యాపార దిగ్గజం లులూ సంస్థకు విజయవాడ పాత బస్‌స్టాండ్ భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసుకునేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు నిర్ణయించింది. రద్దు ఉత్తర్వులను తక్షణం వెలువరిస్తామని రాష్ట్ర హైకోర్టుకు అడ్వకేట్ జనరల్‌తో చెప్పించింది. లులూకు స్థల కేటాయింపును రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఇతరులు సవాల్ చేయగా, బుధవారం న్యాయస్థానంలో ఆ పిటిషన్లపై విచారణ సందర్భంగా సర్కారు రద్దు విషయం వెల్లడించింది. లులూకు భూమి కేటాయింపుపై ప్రభుత్వం వెనక్కి తగ్గడానికి ప్రజా పోరాటమే కారణం. వామపక్షాలు, కార్మికులు, ప్రజా సంఘాలు, బెజవాడ ప్రజానీకం ఆర్‌టిసి స్థలాన్ని లులూకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజా ఉద్యమంతోపాటు న్యాయ పోరాటం చేశారు. జనాగ్రహానికి జడిసిన ప్రభుత్వం దిగి రాక తప్పలేదు. అందుకే లులూకు భూకేటాయింపు రద్దు ప్రజా పోరాట విజయం. చట్టానికి, నిబంధనలకు తిలోదకాలిచ్చి ప్రైవేటు, కార్పొరేట్లకు అడ్డగోలుగా భూకేటాయింపులకు బరితెగిస్తున్న ప్రభుత్వానికి ఈ పరిణామం హెచ్చరిక.విజయవాడ నగర నడిబొడ్డున ఆర్‌టిసి పాత బస్‌స్టాండ్‌కు సంబంధించిన 4.15 ఎకరాలను అంతర్జాతీయ స్థాయి హంగు ఆర్భాటాలతో కూడిన షాపింగ్‌మాల్ నిర్మాణానికి గతేడాది జులైలో లులూ గ్రూపునకు ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం సదరు భూమి మార్కెట్ విలువ రూ.400 కోట్లకు పైమాటే. భూకేటాయింపు ఉత్తర్వుల్లో లులూకు అపరిమిత వెసులుబాట్లు కల్పించారు. విశాఖలో లులూకు గతంలో చేసిన భూకేటాయింపులకు ఇది బోనస్ అనీ అన్నారు. లీజు ఏకంగా 99 సంవత్సరాలు. నిబంధనల ప్రకారం ఏడాదికి అద్దె రూ.40 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా నాలుగు కోట్లకు పరిమితం చేశారు. అంతటితో ఆగకుండా డెవలప్ చేసిన స్థలంలో 1.34 లక్షల చదరపు అడుగులను వేరే వారికి లులూ తన ఇష్టానుసారం సబ్ లీజుకి ఇచ్చుకోవచ్చు. ఇన్నేసి సదుపాయాలు కల్పించడానికి లులూ ఏమన్నా నిరు పేదరాలా? పేదలు ఒక సెంటు ఇంటి జాగా అడిగితే సవాలక్ష ఆంక్షలు, సర్వేలు చేసే ప్రభుత్వానికి లులూ వంటి సంస్థలపై ఎందుకంత ప్రేమ? లులూకు భూకేటాయింపుపై కోర్టులో పడ్డ పిటిషన్లపై ప్రభుత్వం నెలల పర్యంతం కౌంటర్ దాఖలుకు సాహసించలేకపోయింది. అందుక్కారణం నిబంధనల ఉల్లంఘనలని తెలుస్తుంది. రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక మండలికి ఛైర్మన్ స్వయాన ముఖ్యమంత్రి. ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలోనే లులూకు భూమి కేటాయించాలని నిర్ణయమైంది. అనంతరం సిఎం నేతృత్వంలోని కేబినెట్‌లో ఆమోదం పొందింది. నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటే బాధ్యత వహించాల్సింది ఎవరు? అసలు ఆర్‌టిసి స్థలాన్ని ఆ సంస్థ యాజమాన్యంతో సంబంధం లేకుండా ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకోవడమేంటి?రాష్ట్ర పర్యాటక పాలసీలో భాగంగా లులూకు భూమి ఇచ్చామంటోంది ప్రభుత్వం. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' నిర్దేశంలో వచ్చిన పాలసీల్లో ఈ టూరిజం పాలసీ ఒకటి. ప్రభుత్వ 'విజన్' ప్రజల అభివృద్ధికి కాదు, కార్పొరేట్ల దోపిడీకని లులూ వ్యవహారంతో మరోసారి రుజువైంది. పెట్టుబడుల మాటున కార్పొరేట్లకు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను పందేరం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఎకరం 99 పైసలకు 99 సంవత్సరాలకు లీజుకిస్తోంది. ప్రశ్నిస్తే, ఉచితంగా కూడా ఇస్తాం, మా ఇష్టం అని ఐ.టి. మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. రైతులు, నిర్వాసితులు, ప్రజా పోరాటాలపై నిర్బంధం ప్రయోగించైనా సరే, కార్పొరేట్లకు భూములు కట్టబెట్టేందుకు ప్రభుత్వం దుందుడుకుగా వ్యవహరిస్తున్న దశలో లులూ భూ కేటాయింపుపై న్యాయస్థానం వేదికగా వెనక్కి తగ్గడం అసాధారణమే! నయా-ఉదారవాద విధానాల యుగంలో, అదీ దేశంలోనే 'సంస్కరణల'కు ఆద్యుడైన చంద్రబాబు ప్రభుత్వం ఈ పని చేయడం మామూలు విషయం కాదు. రైతుల వీరోచిత పోరాటంతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేసుకుంది. ఇక్కడి లులూ భూకేటాయింపు రద్దునకు సైతం అంతటి ప్రజా పోరాట ప్రాధాన్యమేర్పడింది. పోరాటాలతో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను అడ్డుకోవచ్చన్న సందేశాన్ని ఇస్తుంది. లులూ తరహా భూకేటాయింపులు ఇప్పటి వరకు చాలా చేశారు. వాటన్నింటినీ ప్రభుత్వం రద్దు చేయాలి. సర్కారీ భూములను ప్రజా ప్రయోజనాలకే ఉపయోగించాలి.

# తమిళనాడులో బాక్సింగ్, బెంగాల్‌లో ఫిక్సింగ్




2026 శాసనసభ ఎన్నికల పోరాటంలో మరో కీలకమైన ఘట్టం ఈ నెల 27న ముగియనుంది. 23న తమిళనాడులో పూర్తిగానూ, బెంగాల్‌లో తొలి దశ (మలి దశ 27న) పోలింగ్ జరగనుంది. మిగిలిన చోట్లతో పోలిస్తే ఈ రెండు రాష్ట్రాలు కూడా ప్రత్యేకమైన దృశ్యాన్నే ఆవిష్కరిస్తున్నాయి. దక్షిణ భారతంలో మొదటి నుంచి ప్రాధాన్యత వహిస్తున్న తమిళనాడులో డి.ఎం.కె దేశంలో 2004 నుంచి బిజెపిని నికరంగా ఎదుర్కొంటున్న ఒకే ఒక ప్రాంతీయ లౌకిక పార్టీగా వుంది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పాటు ఇతర లౌకిక శక్తులతో కాంగ్రెస్‌తో కలసి ఎన్నికలలో మరోసారి అధికారం నిలబెట్టుకోవడానికి పోరాడుతున్నది. ఇక సిపిఎం, వామపక్షాలు 34 ఏళ్ల పాటు అవిచ్ఛిన్నంగా పాలించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పిన పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ (టి.ఎం.సి) నాలుగోసారి అధికారంలోకి రావడానికి నానా పాచికలు వేస్తున్నది. డి.ఎం.కె 2004 తర్వాత బిజెపి మతతత్వ రాజకీయాలను గట్టిగా వ్యతిరేకించే వైఖరి తీసుకుంటే టి.ఎం.సి బిజెపి తో మ్యాచ్ ఫిక్సింగ్‌తో పాలన చేస్తుంటుంది. అందుకే మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఈ రెండు చోట్ల పరిణామాలు ఆసక్తికరంగా వుంటాయి.

## తమిళనాడు వారసత్వం, కూటములు

బ్రిటిష్ వారి ప్రెసిడెన్సీ కాలం నుంచి తమిళనాడుకు రాజకీయ పాలనా ప్రాధాన్యత కొనసాగుతున్నది. ఎ.పి, కేరళ, కర్ణాటక వంటి మిగిలిన దక్షిణాది రాష్ట్రాలలో కొన్ని భాగాలు ఆ ప్రెసిడెన్సీలో భాగంగా వున్నవే. సామాజిక న్యాయం, సామ్యవాద భావజాలం కోసం పోరాటాలు అక్కడ బయలుదేరి వ్యాపించడం కూడా చూస్తాం. 1957లో కేరళలో తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడితే 1967లో తమిళనాడులో తొలి డి.ఎం.కె ప్రభుత్వం అన్నాదురై నాయకత్వాన ఏర్పడింది. తర్వాత కాలంలో కరుణానిధి, జయలలిత, పళనిస్వామి, స్టాలిన్‌ల నాయకత్వంలో ఈ పరంపర కొనసాగుతున్నది. కరుణానిధి హయాంలో ఎన్.డి.ఎ నుంచి బయటికి వచ్చాక మళ్లీ డిఎంకె అటువైపు చూడలేదు. జయలలిత వుండగా తర్వాత ఇప్పటికి కూడా అన్నా డి.ఎం.కె బిజెపితో సన్నిహితంగా వుంటున్నది. ఈ ఎన్నికలలోనూ డి.ఎం.కె వామపక్షాలు, కాంగ్రెస్ తదితర శక్తులతో లౌకిక కూటమి, అన్నా డి.ఎం.కె--ఎన్.డి.ఎ కూటమి ప్రధానంగా పోటీలో వున్నాయి. సీట్ల సర్దుబాటులో ఒడుదుడుకులు ఎదురైనా పరిష్కారం చేసుకుని కేంద్రం నిరంకుశత్వం, మతతత్వ రాజకీయాలపై ఈ కూటమి పోరాడుతున్నది. ఈ క్రమంలో సిపిఎం, సిపిఐ లకు గతంలో వున్న దానికన్నా ఒక స్థానం తక్కువ చేసి చెరి అయిదు చొప్పునే నిర్ణయించినా విశాల జాతీయ ప్రయోజనాల కోణంలో ముందుకు సాగుతున్నాయి. ఎన్నికల ముందు ప్రభుత్వంలో భాగస్వామ్యం వంటి పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన కాంగ్రెస్ తర్వాత తగ్గినట్టు కనిపిస్తుంది. ఇక కమల్‌హాసన్ మక్కల్ నీతి మయ్యం (ఎం.ఎన్.ఎం) శాసనసభకు పోటీ చేయకుండా మద్దతునిస్తున్నది. స్టాలిన్ తమకు ప్రేమతో స్థానాలు ఇవ్వగా తాము ప్రేమతోనే నిరాకరించామని కమల్ ప్రకటించారు. తమను రాజ్యసభకు పంపిన కారణంగా వాణిని దేశమంతా వినిపిస్తున్నామని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కూటమిలో డి.ఎం.కె 164, కాంగ్రెస్ 28, డి.ఎం.డి.కె 10, వి.సి.కె 8, ఎం.డి.ఎం.కె 4, ఐ.యు.ఎం.ఎల్, కె.ఎం.డి.కె, ఎం.ఎం.కె తలా రెండు చొప్పున, ఇంకో నాలుగు పార్టీలు ఒక్కొక్కటి చొప్పున పోటీ చేస్తున్నాయి. ఈ విధంగా చూస్తే అధికారంలో వున్నప్పటికీ డి.ఎం.కె అందరికీ చోటు కల్పించి తమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడానికి అవసరమైన వ్యూహాలలో నిమగ్నమైంది.మరోవైపున మాజీ ముఖ్యమంత్రి ఇ.వి. పళనిస్వామి నాయకత్వంలో అన్నా డి.ఎం.కె 167, బిజెపి 27, పి.ఎం.కె (చీలిక వర్గం) 18, శశికళ మేనల్లుడు దినకరన్ ఎ.ఎం.ఎం.కె 11 స్థానాలలో పోటీ చేస్తున్నాయి. జయలలిత మాజీ నెచ్చెలి శశికళ స్థాపించిన ఎ.ఐ.పి.టి.ఎం.ఎం.కె 21 చోట్ల పోటీ పెట్టి హడావుడి చేస్తున్నది. ఆకర్షణ, విశ్వసనీతయగల నాయకులు లేకపోవడం ఒక పెద్ద ప్రతిబంధకమైతే అనైక్యత కూడా ఈ కూటమికి పెద్ద సమస్యగా వుంది. చాలా హడావుడి చేసిన బిజెపి నాయకుడు అన్నామలైని కూడా టికెట్ ఇవ్వకుండా దూరం పెట్టడం అందుకో ఉదాహరణ మాత్రమే. తమిళనాడులో వివిధ కులాలు, గ్రూపులు వాటి నాయకుల చీలికలను బట్టి కూడా పార్టీలు పెట్టుకుంటూ పోవడం పరిపాటి.

## విజయ్ ఎఫెక్ట్?

ప్రధాన పోటీ ఈ రెండు కూటముల మధ్యనే అయినప్పటికీ ప్రముఖ కథానాయకుడు దళపతి విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టి.వి.కె) తమిళనాడు ఎన్నికల దృశ్యాన్ని కాస్త తికమక చేసింది. యువతలో వున్న సినీ ఆకర్షణను ఉపయోగించుకుని విజయ్ పెద్ద పెద్ద మాటలతో హడావుడిగా మొదలెట్టారు. క్రైస్తవ, ముస్లిం ఓట్లను డి.ఎం.కె కు దూరం చేయడంలో ఆయన ప్రభావం వుంటుందని మీడియా కొన్ని జోస్యాలు చెప్పింది. బిజెపి కూడా విజయ్ జోసఫ్ అంటూ ఆయన మతాన్ని ప్రధానంగా ముందుకు తెచ్చే ప్రయత్నం చేసినా తర్వాత దాగుడుమూతలాడింది. అయితే తొక్కిసలాట ఘటన తర్వాత విజయ్ కొంత కాలం కనిపించకుండా పోయారు. తన ప్రధాన శత్రువు డి.ఎం.కె అంటూనే విజయ్ బిజెపి తో పొత్తు పెట్టుకోవడానికి నిరాకరించారు. లౌకిక విలువలకు కట్టుబడి వుంటానని తెలిపారు. ఆయన వైఖరి స్పష్టమైన తర్వాత కేంద్ర దర్యాప్తు సంస్థల తీరు మారింది. ఆయన చిత్రం జననాయగన్ విడుదల కూడా ఆగిపోయింది. ఇప్పుడు ఆ చిత్రం లీక్ కావడం వివాదంగా మారింది. కొన్ని నియోజకవర్గాలలో విజయ్ ప్రభావం డి.ఎం.కె విజయానికి దోహదం చేస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఎ.పి ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ కూడా తమిళనాడులో కాలూనడానికి విఫలయత్నం చేసి విరమించుకున్నారు. తమాషా ఏమంటే సనాతనం వివాదం దేశమంతటా రగిలిందిగానీ ఈ ఎన్నికలలో ఏ పార్టీ కూడా ఆ సంప్రదాయ వర్గాలకు ఒక్క టికెట్ ఇవ్వడానికి కూడా వెనుకాడింది. మరోవైపున 'సర్' పేరిట భారీగా ఓట్ల తొలగింపు కూడా విమర్శలకు కారణమైంది. ఏది ఏమైనా స్టాలిన్ మళ్లీ అధికారంలోకి వస్తారనే భావన బలంగా వినిపిస్తున్నది.

## బెంగాల్ మ్యాచ్ ఫిక్సింగ్

దేశంలో మరెక్కడా లేని వింత పరిస్థితి బెంగాల్‌లో చూస్తాం. ఎన్నికలు వస్తున్నాయనేంత వరకూ బిజెపి ఈసారి అధికారంలోకి వస్తుందని మీడియా ఊదరగొడుతుంది. తీరా దగ్గరకు వచ్చాక మరోసారి మమతా బెనర్జీనే అనే కథనాలు ప్రారంభిస్తుంది. బిజెపి నేతలు కూడా మొదట మమతపై చిందులు తొక్కుతారు. కానీ ఎలాంటి నిజమైన చర్యలు తీసుకోరు. త్రిశూల వ్యూహంతో దేశమంతటా తమకు నచ్చని ముఖ్యమంత్రులను కూడా అరెస్టులు చేసిన కేంద్ర సంస్థలు ఆరె.జి.కర్ ఆస్పత్రి వంటి దారుణ ఘటనల నుంచి రిక్రూట్‌మెంట్ స్కాం వంటి వాటి వరకూ ఇంకా వెనక్కు వెళితే శారదా చిట్స్ కుంభకోణం, రైల్వే కేటాయింపుల కుంభకోణాల వరకూ దేన్నీ చివరికంటా కొనసాగించరు. కాకపోతే ఈ మధ్యలో కొందరు నాయకులు అటూ ఇటూ మారతారు. ఇప్పుడు బిజెపి కి అతి కీలక నేతగా వున్న సువేందు అధికారి కూడ మమతా వారసుడుగా వెలుగొందిన ఆమె మేనల్లుడే! గవర్నర్లు, హైకోర్టు న్యాయమూర్తులు కూడా బెంగాల్‌లో ప్రత్యక్ష వ్యాఖ్యలు చేసి ప్రకంపనలు పుట్టిస్తారు. కానీ చివరకు కథ మామూలే. ముఖ్యమంత్రి మమత సరేసరి. పదవితో నిమిత్తం లేకుండా ఎక్కడికక్కడ దిగబడటం, ధర్నాలు చేయడం కాగితాలు లాక్కోవడం వంటివి చేసి వివాదాలు తీసుకొస్తారు. తీరా అంతా చడీచప్పుడు లేకుండా ముగిసిపోతుంది. శుక్రవారం నాడు హోం మంత్రి అమిత్ షా బెంగాల్‌లో తమ ఎన్నికల ప్రణాళిక విడుదల చేశారు. టిం.ఎం.సి నుంచి నిష్క్రమించి స్వంతంగా ఒక పార్టీ పెట్టుకుని బెంగాల్‌లో బాబ్రీ మసీదు నిర్మాణం వంటి వివాదాలకు కారకుడైన హుమాయున్ కబీర్ బిజెపి దగ్గర వెయ్యి కోట్లు తీసుకున్నానని చెప్పినట్టు ఒక వీడియో అదే సమయంలో వైరల్ అయింది. కబీర్‌తో పొత్తు పెట్టుకుని ఎన్నికలలో పాల్గొంటున్న మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ వెంటనే తన పర్యటన రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. వాస్తవానికి ఒవైసీపై ఆ ఆరోపణ ఎప్పుడూ వుంటున్నదే. ఇవన్నీ కేవలం ఒక ద్విముఖ పోటీ వాతావరణం తీసుకురావడానికేనని, మూడవ పెద్ద శక్తిగా వున్న వామపక్షాన్ని పక్కకు నెట్టడానికేనని అర్థమవుతుంది.

# మహనీయుల స్ఫూర్తితో కుల వివక్షను తరిమికొడదాం


'కుల వివక్ష ఇప్పుడు ఎక్కడుంది? ఇప్పుడంతా మారిపోయింది అందరూ కలిసి తింటున్నారు. కలిసి తిరుగుతున్నారు. హోటళ్లలో, జాతర్లలో, ఉత్సవాల్లో అన్నింట్లో కలిసే ఉంటున్నారు. ఇంకెక్కడుంది?' ఈమధ్య మనువాదుల నుండి ఈ మాటలు వినిపిస్తున్నాయి. మోడీ పాలనలో దేశం చాలా మారిందంటున్నారు. వివక్ష లేనే లేదంటున్నారు. కానీ...నేటికీ నిచ్చెన మెట్ల కుల జాఢ్యం అణగారిన ప్రజల్ని పట్టి పీడిస్తూనే ఉంది.

మాలమాదిగ పల్లెల్లో ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కనిపిస్తూనే ఉంది. అయితే గతంలో ఉన్నంత మొరటుగా ఇప్పుడు లేకపోవచ్చు కానీ, కులవివక్ష రూపం మార్చుకుని మరో రూపంలో కొనసాగుతున్నది. శాస్త్ర, సాంకేతిక రంగం ఇంత అభివృద్ధి చెంది మంచి ఫలితాలు సాధిస్తుంటే ఇదేం కులవివక్ష అనుకోవచ్చు. స్వాతంత్ర్యం రాక ముందు, వచ్చిన తర్వాత కొనసాగడానికి అగ్రవర్ణాల ఆధిపత్యంతో నడిచే పాలక ప్రభుత్వాలే కారణమని చెప్పవచ్చు.

మన రాష్ట్రంలోనూ దళితులపై దుర్మార్గమైన దాడులు, దౌర్జన్యాలు, లైంగిక అకృత్యాలు, హత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని జాతీయ నేర విభాగం నివేదికలు తెలుపుతున్నాయి.

నగరాల్లో శాకాహారులకు మాత్రమే ఇళ్లు అద్దెకిస్తారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు అద్దెకు ఇవ్వరు. పైగా 'శాకాహారులకు మాత్రమే ఇల్లు అద్దెకు ఇవ్వబడును' అని తమ ఇంటి గోడలు, గేట్‌లకు బోర్డులు పెడుతున్నారు.

జస్టిస్ పున్నయ్య కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి 164 రకాల కులవివక్ష రూపాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. పరిష్కారం కోసం సూచనలు చేసింది. కమిషన్ ఏర్పాటు చేసిన పాలకులు ఆ




సూచనలను చిత్తశుద్ధితో అమలు చేయాలి కదా! నేటికీ పున్నయ్య సిఫారసు చేసిన నలభై అంశాల్ని సర్కార్ పట్టించుకోవడమే లేదు. ఫలితంగా నేటికీ కుల వివక్ష రూపాలు కొనసాగుతున్నాయి. పున్నయ్య కమిషన్ చేసిన సిఫారసుల్లో ప్రధానమైనది...వారంలో ఒకరోజు ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కుల వివక్షను గుర్తించి దాన్ని రూపుమాపడానికి ప్రయత్నించడం. కానీ ఎక్కడా ఆ సిఫారసు అమలుకు నోచుకోవటం లేదు. 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతి నెల చివరి రోజు కుల వివక్ష, అంటరానితనంపై చైతన్య సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నది. కానీ దాన్ని ఎక్కడా అమలు జరపటం లేదు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగిన సందర్భంలో ఏకైక రక్షణ కవచంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పూర్తిగా నీరుగారుస్తున్నారు. 41 సి.ఆర్.పి.సి కింద స్టేషన్ బెయిలిస్తూ దాడులు మరింతగా పెంచడానికి ఊతమిచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు. ఆరెస్సెస్-బిజెపి మనువాద మతోన్మాద విధానాలు పల్లెల వాతావరణాన్ని చెదరగొడుతున్నాయి. కుల వివక్ష, అంటరానితనాన్ని మరింతగా విస్తృత పరుస్తున్నాయి. చినజీయర్ స్వామి లాంటి వారు 'కులం ఉండాల్సిందే, కులం పోకూడదు. ఒక మనిషి శరీరానికి కాళ్లు రెక్కలు ఎంత అవసరమో, దేశానికి కులాలు అంత అవసరం' అని ప్రబోధిస్తున్నారు. గ్రామ సీమల్లో దళితులు అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే...దానికి పోటీగా ఆరెస్సెస్ వారు...ఇతరులను రెచ్చగొట్టి, ఇతర నాయకుల విగ్రహాలను పెట్టి ప్రజల మధ్య ఘర్షణలను సృష్టించి కులాల కుంపటిని రగిలించి రాజకీయాలు నడుపుతున్నారు. పూలే, అంబేద్కర్ జయంతి, వర్ధంతుల సందర్భంగా దండలేసి దండాలు పెట్టి వారి ఆశయాలు నెరవేర్చినట్టు భావిస్తుంటారు కొందరు. కానీ పూలే, అంబేద్కర్ తమ వ్యక్తిగత జీవితంలో అనుభవించిన కుల వివక్షను పారదోలటానికి ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలు నిర్మించారు. వాటి గురించి మాత్రం ఆలోచించరు. పూలే-అంబేద్కర్ అడుగు జాడల్లో నడుస్తున్న కె.వి.పి.ఎస్...నేటికీ కొనసాగుతున్న కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలను చేయసాగింది. అందులో భాగంగానే ఈ నెల 11 (పూలే జయంతి) నుండి 14 (అంబేద్కర్ జయంతి) వరకు ఈ ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. క్షేత్ర స్థాయిలో కుల వివక్షపై సమగ్ర సర్వేలు చేసి ప్రత్యక్ష ప్రతిఘటనా పోరాటాలు నిర్వహించాలని సంఘం నిర్ణయించింది.

సమాజహితం కోరుకునే వ్యక్తులు, శక్తులు, ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తూ ఈ ఉద్యమాల్లో పాలుపంచుకోవాలని కె.వి.పి.ఎస్ పిలుపునిస్తోంది. చాప కింద నీరులా పాకుతున్న మనువాద సంస్కృతి, కుల వివక్ష, అంటరానితనం పూర్తిగా రూపుమాపబడాలంటే ప్రజలు ఐక్యంగా పూనుకోవాలి. వీటిని ప్రతిఘటించి పారదోలాలి.